12

# జిత్తులమారి

ఒక అడవిలో రెండు నక్కలు ఉండేవి.

నక్కలు మహా తెలివిగలవన్న విషయం అందరికీ తెలిసిందే గదా! వాటికి కోళ్ళు అంటే మహా ఇష్టం. ప్రతిరోజూ కోళ్ళను అరగించేందుకు అవో ఎత్తు వేశాయి.

రోజూ రాత్రి అవి దగ్గర్లో ఉన్న గ్రామానికి వెళ్లేవి. ఒక నక్క పసిపిల్ల ఏడుస్తున్నట్లుగా నటించేది. ఆ శబ్దానికి ఇంట్లోనివారు బయటకు రాగానే రెండో నక్క దొడ్లో ప్రవేశించి,కోడిని నోట కరుచుకుని పారిపోయేది. మొదటి నక్క జనాన్ని చూడగానే ఏడుపు ఆపేసి తానూ పారిపోయేది.

అయితే... ఈ నాటకం ఎక్కువకాలం సాగలేదు. ఒకరోజు గ్రామస్థులు ఒక నక్కని కర్రతో కొట్టి చంపారు. రెండోది పారిపోతుంటే వల వేసి పట్టుకున్నారు. మిగతా నక్కలకి భయం కల్పించే ఉద్దేశంతో దాని వెనక కాళ్ళు రెండూ కట్టి చెట్టుకు వ్రేలాడ దీసి వెళ్లిపోయారు.

నక్క ఎంత గింజుకున్నా కట్లు విడిపించుకోలేక పోయింది.

'ఎలా బయట పడాలా..?' అని గిలగిలలాడుతున్న నక్కకి అటుగా వస్తున్న ఒక ఎలుగుబంటి కనిపించింది. వెంటనే నక్క మనసులో ఒక ఉపాయం మెరిసింది. ఎంతో ఉల్లాసంగా పాట పాడుతూ ఉయ్యాలూగుతున్నట్లు ఊగడం మొదలు పెట్టింది.

అది చూసి ఎలుగుబంటి – "నక్క బావా... ఇదేమిటి,చెట్టుకు వ్రేలాడుతున్నావు?" అని అడిగింది.

అందుకు నక్క– "నేను కావాలనే కట్టించుకున్నాను. ఈ ఆట ఎంత సరదాగా ఉంటుందో నీకేం తెలుసు?" అంది మరింత ఊగుతూ. అదేమిటో చూడాలని ఎలుగుకి కూడా అనిపించి, నక్కను విడిపించి తన కాళ్ళను కట్టించుకుంది.


జిత్తులమారి

నక్క ఎలుగుని కట్టేసి 'బ్రతుకు జీవుడా...' అంటూ అడవిలోకి పారిపోయింది.

ఆకలితో నకనకలాడుతున్న నక్కకి అడవిలో ఒక ఏనుగు మృత కళేబరం కనిపించింది. 'ఆహా... నెలల తరబడి సరిపడే ఆహారం దొరికిం' దని సంతోషపడ్తూ గబగబా ఆ శవం దగ్గరకు వెళ్లింది.

ఆ ఏనుగుకి బొడ్డు దగ్గర ఏదో పీకివేయడంతో రంధ్రం ఏర్పడి, క్రితంరోజు కురిసిన వానతో బాగా తెరుచుకుని ఉంది. పిసినారి నక్క ముందుగా ఆ కన్నంలోంచి లోపలికి దూరి ప్రేగులు తినాలనుకుని లోపలికి దూరి తినడం మొదలుపెట్టింది.

క్రమంగా ఎండ బాగా కాయడంతో తెరుచుకున్న ఆ రంధ్రం గట్టిగా మూసుకు పోయింది. లోపల బందీ అయిపోయిన నక్క- బయటకి రావడానికి లోపల్నించి గోళ్ళతో గీరడం మొదలుపెట్టింది. అయినా... ఫలితం లేకపోవడంతో, జనాన్ని ఆకర్షించడానికి తన పాత పద్ధతిలో లోపల్నుంచి పసిపిల్లలాగా ఏడుపు మొదలు పెట్టింది.

ఆ సమయానికి శంకరుడు కైలాసం వదిలి భూసంచారానికి వస్తూ అటు రాసాగాడు. ఆ ఏడుపు విని "ఎవరది?" అని అడిగాడు.

నక్క బింకంగా "నేను ఆదిశక్తిని. మరి... నువ్వెవరు?" అని అడిగింది.

"నేను శంకరుడిని!" అని జవాబిచ్చాడు శివుడు.

"నువ్వు నిజంగా శంకరుడివైతే ఉన్న ఫళంగా వర్షం కురిపించు!" అంది నక్క తెలివిగా.

"అదెంత పని..?!" అంటూ కుండపోతగా వర్షం కురిపించాడు.

వర్షం కురవగానే ఆ తడికి ఏనుగు రంధ్రం తెరుచుకుంది. వెంటనే నక్క ఛెంగున బయటకి దూకింది.

నక్క తనని మోసంజేసిందని తెలియగానే శివుడికి కోపం వచ్చి మూడో కన్ను తెరిచి దానిని భస్మం చేయబోయాడు. అయితే... నక్క ఆయనని శరణు వేడి తన గోడు చెప్పుకోవడంతో క్షమించి వదిలి పెట్టాడు. అయితే... ఇకముందు ఇతరులను ఆ విధంగా మోసం చేయకుండా ఉండేందుకు నక్కలకు ఇతర స్వరాలను అనుకరించే శక్తి లేకుండా చేశాడు.

★★★

